# 4

"మాటలాడవే, ముండా" ఉడికే అన్నాన్ని ఒకసారి కలిపి, గరిటతో కూతురు దగ్గరకి నడిచింది పైడమ్మ. "చెప్పు, పని, ఎందుకు మానేసావో చెప్పవే".

కొండమ్మ బదులు పలకలేదు. దించిన ముఖం ఎత్తి ఒకసారి తల్లిని చూసింది. విశాలమైన నీలి ఆకాశాన్ని ఆక్రమించుకున్న సాయం సంధ్యపు ఎర్రమబ్బులు, ఆమె కళ్లల్లో కనబడ్డాయి. అప్పుడప్పుడే కురిసే మంచు బిందువుల లాంటి కన్నీటి చుక్కలు ఆమె కళ్ల నుంచి జాలువారాయి.

"అలా బెల్లం కొట్టిన రాయిలా కూకున్నావేంటే?" కూతురు నెత్తిమీద ఒక మొట్టికాయ వేసి మళ్లీ అడిగింది పైడమ్మ. "ఎందుకు మానావే పని?"

పైడమ్మ, మనస్సు కుతకుతలాడుతోంది. ఎదురుగా కనబడిన మంటే కుంపటి తన మనస్సులోనే వున్నట్టు, తోచింది ఆమెకు.

బంగారం లాంటి పని! మంచి జీతం! బంగారం లాంటి అమ్మగారు! కొండమ్మని సొంత పిల్లలా చూసుకునే అమ్మగారు! నాలుగు రోజులు నాగా పెట్టినా జీతం కొయ్యదు! పైగా, పండుగకి కొత్త బట్టలు! ఎడ్వాన్సులు!

ఆరు సంవత్సరాల నుంచి చేసుకొస్తుంది. ఇప్పుడు హఠాత్తుగా మానటమేమిటి?

"ఏం, అడిగేది నిన్ను కాదా?"

గరిటతో ఒకటి తగిలించింది పైడమ్మ

"ఎందుకు మానావో చెప్పి ఏడు".

"నేనేం మానలా" దెబ్బతగిలిన భుజం తడుముకుంటూ అంది. కొండమ్మ "అమ్మగారే మానమన్నారు".

ఉడుకే అన్నంకుండ తిరగబడినట్టే తోచింది పైడమ్మకి.

"అబద్దాలాడమాక, అమ్మగారు మాన్పించరు".

"నిజం, అమ్మగారే మానమన్నారు. నీమీద ఒట్టు".

ఆ మాటలు నమ్మలేక పోయింది పైడమ్మ. నిన్నకూడా అమ్మగారిని కలిసింది పైడమ్మ. అమ్మగారు బాగానే మాటలాడారు వైశాఖం రాగానే కొండమ్మకి పెళ్లి చెయ్యాలనే ఆలోచన చెప్తే అమ్మగారు ఒప్పుకోలేదు.

"పెళ్లికి ఇప్పుడెందుకు తొందర. ఒక నాలుగేళ్లు పోనీయి" అమ్మగారు అన్నారు "మొన్ననేగా పెద్దపిల్ల అయ్యింది".

ఆరు నెలల క్రితం కొండమ్మ పెద్దపిల్ల అయినప్పుడు పట్టు పరికిణీ పెట్టారు అమ్మగారు. రోల్డు గోల్డు నెక్‌లెస్ కూడా కొన్నారు.

"పైడమ్మా, నీ కూతురు ఆరేళ్ల నుంచి నాతోనే వుంది. నాతోనే తిరుగుతుంది" నెక్‌లేస్ ఇస్తూ అమ్మగారు అన్నారు.

"బాగా కనబడవొద్దూ. అయినా నాకు మాత్రం ఎవరున్నారు చెప్పు పిల్లా.. జల్లా.."

పైడమ్మకి ఏం చెప్పాలో తోచలేదు. ఆ అమ్మగారి ఇంటిలో పని దొరికినందుకు దేవుడికి వందసార్లు దండాలు పెట్టుకుంది.

కాని అయ్యగారికి కొండమ్మ అంటే చికాకు. కొండమ్మ పనిలో చేరిన కొత్తలో, ముక్కు చీవుడు కారే ఆ పిల్లని మాన్పించమని రోజూ చెప్పేవారట! కొండమ్మ గురించి అమ్మగారు అయ్యగారు దెబ్బలాడుకోవటం కూడా చూసిందట, కొండమ్మ! ఏ చిన్న పొరపాటు చేసినా, ఒక చిన్న గ్లాసు జారి పోయినా, తిట్టరాని తిట్లు తిట్టేవాడట అయ్యగారు! ఒకసారైతే ఒక కప్పు విరిగిపోయిందని పెద్ద రాద్ధాంతమే

అయ్యింది. నానా తిట్లు తిట్టి ఆ రోజు వరకు డబ్బు లెక్కకట్టి కప్పు ఖరీదు కోసేసి మిగతా డబ్బు కొండమ్మ చేతిలో పెట్టి పని మానేయిమన్నాడు అతడు, అమ్మగారు గట్టిగా నిలబడ్డారు కనుక గానీ లేక పోతే.. కాని ఇప్పుడు....

"దొంగ ప్రమాణాలు చెయ్యక, కళ్లు పోతాయి" పైడమ్మ మళ్లి అడిగింది "అమ్మగారా, అయ్యగారా, ఎవరు మానమన్నారు?".

"నిజమేనమ్మా,అమ్మగారే."

"ఏమైందో చెప్పి ఏడవే.. ఆ మహాతల్లి కాళ్లు పట్టుకుంటానే, చెప్పు. చేసిన తప్పు మన్నించమని బతిమాలుతానే.."

"నేనేమి చెయ్యలేదమ్మా" కొండమ్మ మోము ఎత్తింది. "షోకేసు దులుపుతున్నారు, అమ్మగారు. షోకేసులో మంచి స్ఫటికపు బొమ్మ వుందమ్మా. రాధాకృష్ణులది. అదిగో చూడు. ఆ చందమామ అంత తెల్లగా వుందమ్మా. అది ఎవరో అమ్మగారి పెళ్లికిచ్చారట".

అమ్మగారికి ఆ బొమ్మ అంటే చాలా ఇష్టమట! అందుకే ఆ బొమ్మ చేతుల్లో వుంచుకొని అమ్మగారే దులుపుతున్నారు కాని..."

"కాని.."

"అమ్మ గారికి సెల్‌ఫోను వచ్చింది. బొమ్మ నా చేతికి ఇచ్చి జాగ్రత్తగా పట్టుకోమని చెప్పి, మాటలాడుకుంటూ బయటకు వెళ్లారమ్మా గట్టిగానే పట్టుకున్నాను. కాని.."

"కాని..."

'అయ్యగారు నన్నే అలా చూడటం చూసానమ్మా, భయం వేసింది. బొమ్మ చేజారిపోయింది. ముక్కలు ముక్కలుగా విరిగిపోయింది.

"ముదనష్టపుదానా.... గట్టిగా పట్టుకోలేవే..

మరి అమ్మగారికి కోపంరాదే...."

"కోపం వచ్చింది. కాని.... అందుకు మాన్పించలేదట..."

"మరి.."

"నేను ఏడుస్తూ విరిగిన ముక్కలు ఏరుతున్నానమ్మా. ఆ లోగ అయ్యగారు నా దగ్గరకు వచ్చారు. 'పోతె పోనీలే అన్నారమ్మా. ఆ తరువాత ఏడవకని నా కన్నీరు తుడిచారమ్మ. పోనీలే అని బుగ్గమీద ముద్దు పెట్టారమ్మా. అది చూసి అమ్మగారు వెంటనే పని మానేయమని చెప్పారమ్మా."

పైడమ్మ కదలకుండా ఒక నిమిషం అలా ఉండిపోయింది. ఒకసారి నఖ శిఖాంతం కొండమ్మని చూసింది. అప్పుడే విరిసే పరువపు మందారాలు కొండమ్మని అందగత్తెగా తీర్చి దిద్దటం గమనించింది. "నిజమేనే. అమ్మగారు చాలా మంచివారు. అందుకే నిన్ను పనిలో నుంచి తీసేసారు. తల్లికాక పోయినా ప్రతి స్త్రీలోను వుండే తల్లి హృదయం ఆమెలో కూడా వుంటుంది కదా. పోనిలే ఇంకో పని చూసుకుందాం"

కొండమ్మకి ఏమీ అర్థం కాలేదు. తల్లివైపు చూస్తూ నిలబడింది.

శారీరకంగా ఎదిగినా, లోకజ్ఞానం ఎదగని కొండమ్మకి మనిషి మనస్సులోని దురుద్ధేశాలు ఎలా అర్థమవుతాయి!

'లోగుట్టు ఎరుమాళ్లకెరుక!'